ఫంక్షన్‌హాళ్లపై పట్టింపేది?



- కనిపించని సీసీ కెమెరాలు
- ఒకే రోజు మూడు హాళ్లలో చోరీలు
- ఫైర్ సేఫ్టీ పరికరాలు కరవు
- నిబంధనలు పాటించని యజమానులు
- పట్టించుకోని అధికారులు

జనగామ, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఫంక్షన్ హాళ్లలో నిఘా కరువైంది. నిత్యం పెళ్లిళ్లు, పుట్టినరోజు, ఇతరత్రా వేడుకలు నిర్వహించుకునే ఫంక్షన్ హాళ్లలో సీసీ కెమెరాలు లేకపోవడం దొంగలకు కలిసొచ్చింది. యథేచ్ఛగా చోరీలకు పాల్పడుతున్నారు. దొంగల భయంతో జిల్లాలో చాలా మంది తమ ఇళ్లు, దుకాణాలు, కార్యాలయాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుంటున్నారు. కానీ.. పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాల సందర్భంలో వందల సంఖ్యలో గుమిగూడి ఉండే ఫంక్షన్‌హాళ్లలో సీసీ కెమెరాలు లేకపోవడం గమనార్హం. ఫంక్షన్ హాళ్లలో సీసీ కెమెరాల ఏర్పాటు గురించి ఇటు యజమానులు గానీ, అటు పోలీసులు, అధికారులు గానీ పట్టించుకోకపోవడం శోచనీయం. జిల్లావ్యాప్తంగా సుమారు 60 నుంచి 70 వరకు ఫంక్షన్ హాళ్లు ఉన్నాయి. వీటిలో 70-80 శాతం ఫంక్షన్ హాళ్లలో సీసీ కెమెరాలు లేవు.

ఒకేరోజు మూడు ఫంక్షన్‌హాళ్లలో చోరీ

జిల్లాకేంద్రంతో పాటు పెంబర్తిలోని రెండు ఫంక్షన్‌హాళ్లలో ఇటీవల ఒకే రోజు మూడు చోరీలు జరిగాయి. గుర్తు తెలియని వ్యక్తులు ఫొటోగ్రాఫర్ల కెమెరాలు, లెన్స్, డ్రోన్ కెమెరాలను ఎత్తుకెళ్లారు. పెళ్లి ఫొటోలు తీయడంలో ఫొటోగ్రాఫర్లు బిజీగా ఉండగా దొంగలు ఈ చోరీకి పాల్పడ్డారు. జిల్లాకేంద్రంలోని సాయిరాం కన్వెన్షన్ హాల్‌లో ఆలేరుకు చెందిన ఫొటోగ్రాఫర్ రాయపురం శ్రీనివాస్‌కు చెందిన రూ. 1.80 లక్షల విలువైన డ్రోన్ ఎత్తుకెళ్లారు. అదే విధంగా పెంబర్తిలో బీఎంఆర్ గార్డెన్స్‌లో జనగామ ఫొటోగ్రాఫర్ అక్షయ్‌కు చెందిన రూ.20 వేల విలువైన కెమెరా లెన్స్ చోరీకి గురైంది. దీనితో పాటు పెంబర్తి శివమ్ గార్డెన్స్‌లో జనగామ ఫొటోగ్రాఫర్ కొంగరి పర్శరాములకు చెందిన రూ.2.50 లక్షల విలువైన 5డి కెమెరా సెట్‌ను దొంగలు ఎత్తుకెళ్లారు. మూడు చోట్ల సుమారు రూ. 4.50 లక్షల విలువైన కెమెరాలు ఎత్తుకెళ్లారు. కాగా.. యాదాద్రి జిల్లా రాయగిరి ఫంక్షన్‌హాల్‌లోనూ డ్రోన్ కెమెరాను ఎత్తుకెళ్లగా అక్కడ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలో దృశ్యాలు రికార్డ్ అయ్యాయి. ఒకే వ్యక్తి ఈ దొంగతనాలను చేసి ఉంటాడని ఫొటోగ్రాఫర్లు అనుమానిస్తున్నారు. కాగా.. ఫంక్షన్‌హాళ్లలో సీసీ కెమెరాలు లేకపోవడంతో దొంగతనానికి సంబంధించి ఆధారాలు సేకరించడంలో పోలీసులకు ఇబ్బందిగా మారింది. కాగా.. గత ఏడాది కూడా జనగామ నందన గార్డెన్స్‌లో జనగామకు చెందిన ఓ వ్యక్తి బ్రాస్‌లెట్ చోరీకి గురైంది. సీసీ కెమెరాలు లేకపోవడంతో దొంగ ఇప్పటికీ దొరకలేదు.

నిఘాతో అడ్డుకట్ట

సీసీ కెమెరాలు ఉంటే చోరీలకు కొంత అడ్డుకట్ట వేసే అవకాశం ఉంది. జిల్లాలోని పలు ఫంక్షన్‌హాళ్లలో బంగారు ఆభరణాలు చోరీ ఘటనలు చోటుచేసుకున్నాయి. దీనిపై కొంతమంది పోలీసులకు ఫిర్యాదు చేసినా కొంతమంది అంత వరకు వెళ్లలేదు. చోరీలు జరిగిన తర్వాత విచారణ అంటూ హడావిడి చేసే పోలీసులు చోరీలు జరగకుండా అడ్డుకోవడంలో విఫలమవుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. పలు జిల్లాల్లో ఫంక్షన్‌హాళ్లలో మహిళల నెక్లెస్, పుస్తెలతాడు, చైన్ల వంటి బంగారు ఆభరణాల చోరీ ఘటనలు జరిగాయి. దీంతో అక్కడి పోలీసులు ఫంక్షన్ హాళ్లలో సీసీ కెమెరాల ఏర్పాటును తప్పనిసరి చేశారు. కానీ.. జనగామ జిల్లాలో పోలీసుల నుంచి ఆ రకమైన చర్యలు కరువయ్యాయి. జిల్లాలోనూ జనం రద్దీగా ఉండే ఫంక్షన్‌హాళ్లు, కన్వెన్షన్ సెంటర్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఫైర్ సేఫ్టీ అనుమతులు కరువు

ఫంక్షన్‌హాళ్ల నిర్మాణాలకు గ్రామీణ ప్రాంతాల్లో జిల్లా పంచాయతీ అధికారి, మునిసిపల్ పరిధిలో కమిషనర్ అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. వీరితో పాటు అగ్నిమాపక శాఖ నుంచి తప్పనిసరిగా ఫైర్‌సేఫ్టీ అనుమతి ఉండాలి. ఫంక్షన్‌హాల్ నిర్మాణ సమయంలో ముందస్తుగా ప్రొవిజనల్ ఎన్‌వోసీ తీసుకోవాల్సి ఉంటుంది. నిర్మాణం పూర్తయిన తర్వాత ఒరిజినల్ ఫైర్ సేఫ్టీ అనుమతి తీసుకోవాలి. హాల్స్‌లో అగ్నిమాపక నియంత్రణ పరికరాలను అందుబాటులో ఉంచితేనే ఫైర్‌సేఫ్టీ అనుమతి ఇస్తారు. కానీ.. జిల్లాలో 60 నుంచి 70 వరకు ఫంక్షన్‌హాళ్లు ఉండగా కేవలం ఏడింటికి మాత్రమే ప్రొవిజనల్ ఎన్‌వోసీ ఉన్నట్లు జిల్లా ఫైర్ సేఫ్టీ అధికారి మధుకర్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. ఐదేళ్లకు ముందు నిర్మించిన వాటికి అనుమతులు లేవని, ఐదేళ్ల నుంచే ఈ అనుమతులు తీసుకుంటున్నారని అన్నారు. కాగా.. జిల్లాలో ఏ ఫంక్షన్‌హాళ్లలోనూ ఫైర్ సేఫ్టీకి సంబంధించి సరైన పరికరాలు లేకపోయినా అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం.

ఆత్మహత్య ఘటనలో సర్వేయర్ అరెస్ట్

- పరారీలో సీనియర్ అసిస్టెంట్

బచ్చన్నపేట, ఏప్రిల్ 6: మండలంలోని పడమటికేశ్వాపూర్ గ్రామానికి చెందిన రైతు కొమ్మాట రఘుపతి మార్చి 22న ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై పోలీస్ అధికారులు విచారణ వేగవంతం చేశారు. సర్వేయర్ రవీందర్‌ను శనివారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించారు. కేసులో ప్రధాన నిందితుడు సీనియర్ అసిస్టెంట్ అయిన కొలిపాక సుమన్ పరారీలో ఉన్నాడని, అతడి కోసం గాలిస్తున్నామని చినట్టు ఎస్ఐ సతీష్ తెలిపారు. కాగా, భూమిపట్టా చేసి పాస్‌పుస్తకం ఇవ్వటానికి రఘుపతి వద్ద డబ్బులు తీసుకుని పనిచేయకపోగా ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వకపోవటంతో రఘుపతి ఆత్మహత్యకు పాల్పడినట్టు కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఆరోజు రెవెన్యూ కార్యాలయం ఎదుట మృతదేహంతో ఆందోళన నిర్వహించారు. ఈఘటనపై కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా తీవ్రంగా స్పందించారు. అదనపు కలెక్టర్ సుహాసినిని విచారణాధికారిగా నియమించారు. ఇందుకు సంబంధించిన నివేదికలు తెప్పించుకున్నారు. ఈ ఘటనలో సుమన్, రవీందర్‌ను సస్పెండ్ చేసే అవకాశం ఉందని రెవెన్యూ వర్గాలు చెబుతున్నాయి.

కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు సంక్షేమం

- పార్టీ జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి
- తుక్కుగూడ సభకు భారీగా తరలివెళ్లిన శ్రేణులు



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

జనగామ, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీతోనే అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని తుక్కుగూడలో జరిగిన జనజాతర సభకు జనగామ నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తరలివెళ్లాయి. నియోజకవర్గంలోని వివిధ మండలాల నుంచి వచ్చిన వాహనాల్లో కార్యకర్తలు జనగామ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీగా సభకు తరలివెళ్లారు. వాహన ర్యాలీని ప్రతాప్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జనగామ నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసే బాధ్యత తనపై ఉందన్నారు. కేసీఆర్‌కు రైతులపై ప్రేమ లేదని, ఆయన రైతులపై దొంగ ప్రేమ ఒలకబోస్తున్నారని మండిపడ్డారు. రైతులపై ప్రేమ ఉంటే బీజేపీ తెచ్చిన రైతు వ్యతిరేక బిల్లుకు పార్లమెంట్‌లో ఎందుకు మద్దతు తెలిపారో చెప్పాలని ప్రశ్నించారు. రాష్ట్రంలో కేసీఆర్ పని అయిపోయిందని ఎద్దేవా చేశారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో వరంగల్, భువనగిరి స్థానాల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. సభకు తరలి వెళ్లిన వారిలో పీసీసీ సభ్యుడు చెంచారపు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు నర్సింగరావు, బుచ్చిరెడ్డి, బడికె ఇందిర, బనుక శివరాజ్, వంగాల కల్యాణి, నిమ్మతి మహేందర్‌రెడ్డి, వంగాల మల్లారెడ్డి, లింగాల నర్సిరెడ్డి, జక్కుల అనిత తదితరులు ఉన్నారు.

రికార్డు స్థాయిలో ఎండ

- జిల్లాలో 43.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

జనగామ, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శనివారం రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. శుక్రవారం 43.4 డిగ్రీలుగా నమోదు కాగా శనివారం 43.7 డిగ్రీలకు చేరుకుంది. జిల్లాలో అత్యధికంగా పాలకుర్తి, జఫర్‌ఘడ్‌లో 43.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు ఇదే అత్యధికం. జిల్లాలో మొత్తం 20 వాతావరణ కేంద్రాలు ఉండగా అందులో 18 కేంద్రాల్లో ఉష్ణోగ్రతలు ఆరెంజ్ అలెర్ట్‌కు చేరుకున్నాయి. చిలుపూర్ మండలం మల్కాపూర్‌లో 43.6, జనగామ మండలం వడ్లకొండలో 43.6, బచ్చన్నపేటలో 43.2, పాలకుర్తి మండలం వావిలాలలో 43.1, జనగామలో 42.6, రఘునాథపల్లిలో 42.2, దేవరుప్పుల మండలం కోలుకొండలో 41.7, దేవరుప్పులలో 41.6, స్టేషన్‌ఘన్‌పూర్‌లో 41.3, కొడకండ్లలో 41.1, నర్మెట్టలో 41, లింగాలఘణపురంలో 40.9, పడమటికేశవాపూర్‌లో 40.7, తరిగొప్పులలో 40.5, తరిగొప్పుల మండలం అబ్దుల్‌నాగారంలో 40.4, పాలకుర్తి మండలం గూడూరులో 40.2, జఫర్‌గడ్ మండలం కూనూరులో 39.9, స్టేషన్‌ఘన్‌పూర్ మండలం తాటికొండలో 39.7 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జిల్లాలో ఎండ తీవ్రత కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బయట ఎండ వేడి, ఇళ్లలో ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరి అయ్యారు. నిన్నామొన్నటి వరకు 41 డిగ్రీలకే పరిమితమైన ఉష్ణోగ్రత శుక్రవారం 43.4, శనివారం 43.7 డిగ్రీలకు చేరుకుంది. గత ఏడాది ఏప్రిల్ నెలలో 41 డిగ్రీలు మాత్రమే నమోదు కాగా ఈసారి ఏప్రిల్ మొదటివారంలోనే 43 డిగ్రీలకు చేరడం ప్రజల్ని ఆందోళనకు గురిచేస్తోంది.

'స్వీప్'తో ఓటర్లలో చైతన్యం తేవాలి

అధికారులకు కలెక్టర్ రిజ్వాన్ బాషా ఆదేశాలు

జనగామ కల్చరల్, ఏప్రిల్ 6: భారత ఎన్నికల సంఘం చేపడుతున్న స్వీప్ ప్రచార కార్యక్రమాలతో ఓటర్లను చైతన్యవంతం చేయాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా కోరారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో స్వీప్ ప్రచార కార్యక్రమాల నిర్వహణ తీరుపై జిల్లా కలెక్టర్ అదనపు కలెక్టర్లు పింకేశ్‌కుమార్, రోహిత్ సింగ్ తో కలిసి సమీక్ష నిర్వహించారు. స్వీప్ ప్రచార కార్యక్రమం ద్వారా ఓటు హక్కు యొక్క విశిష్టతను తెలియజేయాలన్నారు. ఓటు హక్కు సక్రమంగా వినియోగించుకునేలా విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. కళాశాలల్లో ఆసక్తి కలిగిన విద్యార్థులను బ్రాండ్ అంబాసిడర్లుగా గుర్తిస్తూ 5కె రన్ వంటి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. గ్రామ స్థాయిలో మహిళా సంఘాలకు, పాఠశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టి ఇంటింటి ప్రచారం చేయాలన్నారు. యువ ఓటర్ల పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ప్రతీ కార్యక్రమంలో పోలింగ్ మే 13వ తేదీని ప్రదర్శింపజేయాలన్నారు. సమావేశంలో ఆర్‌డీవోలు కొమురయ్య, వెంకన్న, జడ్పీసీఈవో అనిల్‌కుమార్, స్వీప్ నోడల్ అధికారి, డీఏవో వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాలు.. ఆధ్యాత్మిక కేంద్రాలు..



గూడూరు మండలం మదనాపురం వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వేదికపై మాట్లాడుతున్న త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్‌స్వామి

- సర్వప్రాణులు దైవస్వరూపమే..
- బుద్ధిని బట్టి మనిషి ఉన్నతమైన ప్రాణిగా రూపొందాడు..
- ఆధ్యాత్మిక కేంద్రాలే.. పరివర్తన క్షేత్రాలు..
- త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్‌స్వామి

వివరాలు 7లో..

ఎండిన పంటలకు పరిహారం అందించాలి

రైతుదీక్షలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



జనగామలో రైతుదీక్షలో పాల్గొన్న ఎమ్మెల్యే పల్లా, మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి

జనగామ, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): సాగునీటి కొరత కారణంగా పంటలు ఎండిన రైతులకు ఎకరాకు రూ.25 వేల చొప్పున ప్రభుత్వం పరిహారం అందించాలని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. జిల్లాకేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో శనివారం జరిగిన రైతు దీక్షలో ఆయన మాట్లాడారు.ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రైతులకు ఇచ్చిన హామీలన్నింటినీ వెంటనే నెరవేర్చాలన్నారు. రూ.2 లక్షల రుణమాఫీ అమలు చేయాలని, రైతు బంధు డబ్బులను జమ చేయాలని, ధాన్యానికి రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థ పాలన వల్లే రాష్ట్రంలో పంటలు ఎండిపోయాయని విమర్శించారు. రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల నుంచి వెంటనే నీటి విడుదల చేసి కాలువల ద్వారా పంటలకు అందించాలన్నారు. ప్రజలను, రైతులను దొంగ హామీలతో మభ్యపెట్టి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు గడుస్తున్నా హామీలు మాత్రం అమలు కావడం లేదని విమర్శించారు. రైతులను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలన్నారు.

సాగునీరు ఇవ్వడంలో కాంగ్రెస్ విఫలం: ముత్తిరెడ్డి

కేసీఆర్ నిర్మించిన సాగునీటి ప్రాజెక్టులను వినియోగించడంలో సీఎం రేవంత్‌రెడ్డి విఫలమవుతున్నారని మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి విమర్శించారు. సాగునీరు అందకపోవడం వల్ల రాష్ట్రంలో వరి పంట ఎండిపోయిందని, బాధిత రైతులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. యాసంగి సీజన్ ధాన్యం వస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను కూడా ఏర్పాటు చేయడం లేదని అన్నారు. రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీని ప్రజలు నిలదీయడం ఖాయమని అన్నారు. రానున్న ఎన్నికల్లో రైతులు కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెబుతారని, ఎన్నికల తర్వాత కాంగ్రెస్ పార్టీకి ఊరూరా నిలదీస్తారని అన్నారు. రైతు దీక్షలో జడ్పీ చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మీ, మునిసిపల్ చైర్‌పర్సన్ పోకల జమున, నాయకులు ఇర్రి రమణారెడ్డి, పెద్ది రాజిరెడ్డి, వివిధ మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆస్తులు బయటపెడితే కడియం గుండె పగులుతుంది

ఘన్‌పూర్ రైతు దీక్షలో ఎమ్మెల్యే పల్లా

వివరాలు 8లో..

రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్

- ఇచ్చిన హామీలను విస్మరించిన పాలకులు
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



పాలకుర్తి రైతు దీక్షలో మాట్లాడుతున్న మాజీ మంత్రి దయాకర్‌రావు

పాలకుర్తి, ఏప్రిల్ 6 : ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు విమర్శించారు. శనివారం పాలకుర్తిలో నిర్వహించిన రైతు దీక్షలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఎప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా కరువు వస్తుందని ఎద్దేవా చేశారు. సాగునీరు లేక, విద్యుత్ సరఫరా అందక అన్నదాత కన్నీళ్లు పెట్టుకుంటున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పాలనలో రైతులకు చేతినిండా పని, కంటి నిండా నిద్ర ఉండేదని, కాంగ్రెస్ పాలనలో ఆ రెండూ లేక రైతులు రోడ్డున పడ్డారని అన్నారు. ఎన్నికల ముందు కేసీఆర్ చెప్పినట్లే ఇప్పుడు జరుగుతోందని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఆత్మహత్యలు, ఎరువుల బాధలు, మద్దతు ధర, అప్పులు తెచ్చి మిత్తీలు చెల్లించలేని దుస్థితి ఉందని విమర్శించారు. వర్షాలు కురవలేదని తప్పించుకునేందుకు ఈ ప్రభుత్వం కుటిల ప్రయత్నం చేస్తోందని అన్నారు. నాడు రాజకీయాలు పక్కన పెట్టి కేసీఆర్ రైతు మేలు కోరుతుంటే.. నేడు సీఎం రేవంత్‌రెడ్డి రైతులను పక్కన పెట్టి రాజకీయాలకు జైకొడుతున్నాడని విమర్శించారు. ఎండిన పంటలకు ఎకరానికి రూ. 25 వేలు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతు దీక్ష అనంతరం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఎల్ఈడీ స్క్రీన్ మీద ఎన్నికల సమయంలో, ఎన్నికల తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడిన వీడియోలను పార్టీ శ్రేణులకు చూపించారు. కార్యక్రమంలో నాయకులు పసునూరి నవీన్, నల్ల నాగిరెడ్డి, జడ్పీటీసీ శ్రీనివాసరావు, సుందర్‌రాంరెడ్డి, బస్వ మల్లేషం, మంగలంపల్లి శ్రీనివాస్, ఐలయ్య, రాము, మధుసూదన్ పాల్గొన్నారు.

రంజాన్ వేళలు ఇఫ్తార్ : ఆదివారం సా : 6.35 గం.. | సహర్ : సోమవారం ఉ : 4.42 గం..

ఎల్బీ కళాశాలలో ఫుడ్ ఫెస్టివల్

న్యూశాయంపేట, ఏప్రిల్ 6 : ములుగురోడ్‌లోని లాల్‌బహదూర్ కళాశాల(ఎల్బీ)లో శనివారం ఎంబీఏ విద్యార్థులకు ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ డీహెచ్‌రావు హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించి విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దేవాలయాలు.. ఆధ్యాత్మిక కేంద్రాలు..

త్రిదండి శ్రీమన్నారాయణరామానుజ చిన్నజీయర్‌స్వామి

గూడూరు, ఏప్రిల్ 6 : దేవాలయాలు ఆధ్యాత్మిక కేంద్రాలని.. అవి మనిషిలో మంచి ప్రవర్తన తెచ్చే నిలయాలు కావాలని ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త, శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్‌స్వామి అన్నారు. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం మదనాపురం గ్రామంలో శ్రీలక్ష్మి గోదా సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి నూతన దేవాలయ విమాన గోపుర ధ్వజ శిఖర ప్రతిష్ఠాపన మహోత్సవం సందర్భంగా శనివారం త్రిదండి శ్రీమన్నారాయణరామానుజ చిన్నజీయర్‌స్వామి ఆలయంలో పూజలు, ప్రవచనములు, భక్తుల ఆశీర్వాదం, తీర్థప్రసాదాలు అందజేశారు.

ఈ సందర్భంగా చిన్నజీయర్‌స్వామి మాట్లాడుతూ.. దేవాలయాల్లో ప్రజలు, ప్రసాదాలే కాకుండా ఆధ్యాత్మిక కేంద్రాలుగా ఉన్నాయని, అవి అందరికి మంచి చేసేలా ఉపయోగపడాలన్నారు. దేవాలయాలు, వాటిలో విగ్రహాలు మనస్సుకు అద్దంలా నిలుస్తాయన్నారు. మన ఆలోచన విధానంలో మార్పు తీసుకువచ్చేదే మంత్రమన్నారు. మంత్రం అంటే తరించే వారికి రచించేదేనని చెప్పారు. మనుషులు, జంతువులు, పక్షులు, క్రిమికీటకాలు, సూక్ష్మజీవులు చూస్తే అన్ని వేర్వేరే. కానీ, కలిసి సాగితే సుఖ జీవనమన్నారు. మంచి జీవితం కావాలంటే సహజీవనం అవసరం, అదే సమతా భావమని పేర్కొన్నారు. సమాజంలో ఎన్నో వికార పోకడలు, నేనే గొప్ప, నేనే నిలువాలన్న స్వార్థ చింతనలు పెరిగిపోయాయని చెప్పారు. ఈ తీరు మారాలి. మన ఇల్లు, మన ఊరు, సమాజం, దేశం, ప్రపంచమంతా సంతోషంగా ఉండాలన్నారు. ప్రకృతిలో మనిషే కాదు.. చెట్లు, జంతువులు, సూక్ష్మజీవులు ఎన్నో ఉన్నాయి.. అవి లేకుండా మనిషి ఉండలేడు, కానీ మనిషి లేకుండా అవి ఉండగలవన్నారు. కొవిడ్ లాక్‌డౌన్ సమయంలో మనిషి ఇంటికే పరిమితమైతే ప్రకృతి పరవశించిన విషయాల్ని కళ్లారా చూశామని తెలిపారు. అందుకే మనం పదిలంగా ఉండాలంటే వాటిని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. అద్దం ఎట్లయితే ముఖాన్ని చూపిస్తుందో.. అలాగే విగ్రహం మనిషి మనస్సులోని దేవుడిని చూపిస్తుందన్నారు. అర్థమండపం ఎట్లా ఉండాలి, ముఖ మండపం ఎట్లా ఉండాలి, దేవాలయంలో గజ, జయ, ధ్వజ స్తంభాల వద్ద నమస్కారం చేసిన తర్వాత గర్భగుడిలో ఉన్న దేవతామూర్తుల వద్ద మొక్కులు చెల్లించుకోవాలని చెప్పారు. ప్రతీ వస్తువులో దేవుడు దాగి ఉన్నాడని, రాతి, లోహం, విగ్రహం, వస్త్రం, మట్టితో చేసిన బొమ్మలో సైతం దేవుడిలా కొలుస్తారని పేర్కొన్నారు. కదిలే ప్రాణులు, మనుషులకు, కదల్లేని ప్రాణులు, చెట్లు వాటికి స్థావరాలుగా ఉంటాయన్నారు. గ్రామంలో సంపదకు లోటు లేకుండా జాగ్రత్త పడాలన్నారు. శిలాలోహం భగవంతుడి స్వరూపాలేనని అన్నారు. దేవాలయంలో విగ్రహాలు, శిల, ఉత్సవ రూపంలో ఉంటాయని స్పష్టం చేశారు.


చిన్నజీయర్‌కు మంగళహారతులతో స్వాగతం పలుకుతున్న మహిళలు

సుధీర్‌రెడ్డి సేవలు భేష్..

మదనాపురం గ్రామంలో దేవాలయం ఉండాలని ఆకాంక్షించి శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం, గోశాల, గ్రామ దేవతలకు ఆలయాలు నిర్మించిన లింగాల సుధీర్‌రెడ్డి-రాధిక దంపతులను శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణరామానుజ చిన్నజీయర్‌స్వామి అభినందించారు. గ్రామంలో ఆధ్యాత్మిక సేవలు చేయడం సంతోషకరమన్నారు. ఉన్న ఊరును మరిచిపోకుండా ప్రజల సుఖసంతోషాల్లో భాగస్వాములు కావడం హర్షించదగ్గ విషయమన్నారు. రూ.1.50 కోట్ల సొంత ఖర్చులతో ఆధ్యాత్మిక ఆలయాలను నిర్మించడం అభినందనీయమన్నారు. దేవాలయంలో అన్ని వసతులను కల్పించడం ఆనందంగా ఉందన్నారు. ఈ వేడుకల్లో లింగాల రోహిత్‌రెడ్డి-అనుపమ దంపతులు, లింగాల నితిన్‌రెడ్డి, సుప్రీంకోర్టు మాజీ జడ్జి ఎల్.నర్సింహారెడ్డి, మానుకోట ఎంపీ మాలోతు కవిత, హరిత, మాజీ ఎంపీ అజ్మీర సీతారాం నాయక్, జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్‌నాయక్, గూడూరు సొసైటీ చైర్మన్ చల్లా లింగారెడ్డి, ప్రముఖ వ్యాపారవేత్త శ్రీనివాస్‌రెడ్డి, సనాతన శివాలయం చైర్మన్ ఏపూరు రవీందర్‌రెడ్డి, వివిధ పార్టీల నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, కంభంపాటి ప్రతాప్, మేరెడ్డి సురేందర్, యాదవరెడ్డి, రణధీర్‌రెడ్డి, బోడ కిషన్, మోతీలాల్, చెల్పూరి వెంకన్న, బండి వెంకన్న పాల్గొన్నారు.


వేంకటేశ్వరస్వామి ఆలయానికి వస్తున్న చిన్న జీయర్‌స్వామి

సరిహద్దులో అలజడి

కర్రెగుట్ట ఎన్‌కౌంటర్‌తో అలర్ట్
కూంబింగ్‌ను ముమ్మరం చేసిన గ్రేహౌండ్స్ పోలీసులు

ములుగు, ఏప్రిల్ 6: తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దు పూజారి కాంకేర్ పరిధి కర్రెగుట్ట అటవీ ప్రాంతంలో శనివారం తెల్లవారుజామున జరిగిన ఎన్‌కౌంటర్ జిల్లాలో అలజడి సృష్టించింది. ఈ ఘటనలో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందడం, అందులో భూపాలపల్లి జిల్లా కాటారం మండలానికి చెందిన సంతోష్ అలియాస్ సాగర్ ఉండటం సంచలనం కలిగించింది. దీంతో జిల్లా పోలీసులు అప్రమత్తమయ్యారు. కూంబింగ్‌ను ముమ్మరం చేశారు. ఆదిలాబాద్-మహారాష్ట్ర సరిహద్దులో జనవరి 13న జరిగిన ఎన్‌కౌంటర్ తర్వాత మావోయిస్టులు హతమైన నేపథ్యంలో మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో జిల్లా పోలీసులు నిఘా పెంచారు. పోలీసు రాకపోకలపై కన్నేశారు. విస్తృతంగా వాహనాలను తనిఖీ చేయడంతోపాటు ఇన్‌ఫార్మర్ వ్యవస్థను అలర్ట్ చేశారు. తాజాగా ఇరు రాష్ట్రాల సరిహద్దు పోలీసులు వాజేడు మండలంలో సమావేశమయ్యారు. దేశవ్యాప్తంగా లోక్‌సభ ఎన్నికలు జరుగుతుండగా మావోయిస్టుల నుంచి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు ఎదురవకుండా ప్రశాంతంగా ఎన్నికలు జరిపించే విషయమై చర్చించి నట్లు పోలీసు అధికారులు వెల్లడించారు.

ఈ సమావేశంలో మావోయిస్టులకు చెక్‌పెట్టే పలు అంశాలపై ఇరు రాష్ట్రాల పోలీసులు సమాలోచన చేసినట్లు సమాచారం. ఈ క్రమంలో కర్రెగుట్ట అటవీ ప్రాంతంలో మావోయిస్టులు కదలికలు ఉన్నట్లు నిఘా వర్గాలు ఇచ్చిన సమాచారంతో గ్రేహౌండ్స్ పోలీసులు శుక్రవారం నుంచి సెర్చ్ ఆపరేషన్ మొదలు పెట్టినట్లు తెలిసింది. ఈ బలగాలకు ములుగు జిల్లా పోలీసులు, సరిహద్దు స్టేషన్లలో సుశిక్షితులు పనిచేసే ఈ ప్రాంతంపై అవగాహన ఉన్న అధికారులను రంగంలోకి దింపినట్లు సమాచారం. అనుకున్నట్టుగానే పోలీసులు టార్గెట్‌ను రీచ్ అయ్యారు. దీంతో ఓ రాష్ట్రస్థాయి నాయకుడితోపాటు మొత్తం ముగ్గురు సభ్యులను మావోయిస్టులు కోల్పోయారు. ఈ ఎన్‌కౌంటర్ జరిగిన ప్రదేశం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం ఊసూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోకి వస్తుండటంతో అక్కడి పోలీసులు మృతదేహాలను తరలించారు. ఈ ఎన్‌కౌంటర్‌ను ధ్రువీకరిస్తూ బీజాపూర్ ఎస్పీ జితేంద్ర యాదవ్ ప్రకటన జారీ చేయగా కొద్దిగంటల వ్యవధిలోనే మావోయిస్టులు ఈ ఘటనపై స్పందించారు. ఆజాద్ పేరిట ఓ లేఖ విడుదలైంది. పక్కా సమాచారంతోనే పోలీసులు ఎన్‌కౌంటర్‌కు పాల్పడ్డారని, ములుగు ఎస్పీ ఆధ్వర్యంలో ఈ ఆపరేషన్ జరిగిందని పేర్కొన్నారు.

అటవీ ప్రాంతంలో ఉద్రిక్తత

తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లోని పూజారి కాంకేర్ గ్రామ సమీపంలోని కర్రెగుట్టల అటవీ ప్రాంతంలో శనివారం తెల్లవారుజామున జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టులు మృతిచెందారు. ఎన్‌కౌంటర్ నేపథ్యంలో తెలంగాణ సరిహద్దు, ఛత్తీస్‌గఢ్ అటవీ ప్రాంతంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా పూజారికాంకేర్ గ్రామ సమీపంలోని కర్రెగుట్టల అటవీ ప్రాంతంలో ఛత్తీస్‌గఢ్ పోలీసులతో పాటు గ్రేహౌండ్స్ బలగాలు జాయింట్ యాంటీ నక్సల్స్ ఆపరేషన్‌లో భాగంగా కూంబింగ్ నిర్వహిస్తుండగా మావోయిస్టులు తారసపడడంతో ఎదురుకాల్పులు జరిగినట్టు తెలుస్తోంది. ఈ కాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మృతిచెందినట్లు తెలుస్తోంది. మృతుల్లో సీపీఐ మావోయిస్టు పార్టీ సీఆర్‌సీ-2 (సెంట్రల్ రీజినల్ కమాండ్ కమిటీ) కమాండర్ అన్న సంతోష్ అలియాస్ సాగర్ అలియాస్ శ్రీధర్, మరొకరు మహిళా మావోయిస్టు ఉండగా మిగిలిన మరొకరిని ఇంకా గుర్తించాల్సి ఉంది. మజీరామ్, మరొకరు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా పూజారికాంకేర్ గ్రామానికి చెందినట్లు సమాచారం. బీజాపూర్ ఎస్పీ జితేందర్ యాదవ్ ఎన్‌కౌంటర్ విషయాన్ని ధ్రువీకరించగా ఊసూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైనట్లు ఓ ప్రకటనలో తెలిపారు. ఘటన స్థలంలో ఒక ఏకే-47, ఎస్ఎల్ఆర్, విప్లవ సాహిత్యం లభించగా పోలీసులు స్వాధీనం చేసుకున్నట్టు తెలిసింది.

రెండేళ్ల తర్వాత..

చివరిసారిగా 2022జనవరి 18న ఇదే కర్రెగుట్ట అటవీ ప్రాంతంలో ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఘటనలో వాజేడు-వెంకటాపురం ఏరియా కమిటీ కార్యదర్శి మడకం సింగి అలియాస్ శాంత, గుండాల-కర్కపల్లి ఏరియా కమిటీ కమాండర్ కొమ్ముల నరేష్ అలియాస్ బుద్రన్న, మరో మావోయిస్టు సభ్యుడు మృతిచెందాడు. పెద్దసంఖ్యలో మావోయిస్టులు సంచరిస్తున్నారనే పక్కా సమాచారంతో రెండు రోజులుగా ఛత్తీస్‌గఢ్ సీఆర్పీఎఫ్, తెలంగాణ పోలీసులు సంయుక్తంగా కూంబింగ్ ఆపరేషన్ చేపట్టారు. ఆరోజు ఉదయం 7గంటల ప్రాంతంలో మావోయిస్టులు-పోలీసుల మధ్య ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. దాదాపు రెండుగంటలపాటు ఇరువర్గాల నడుమ కాల్పులు జరుగగా గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ మధుకు బుల్లెట్ గాయమైంది. కాగా, ఈ ఎదురుకాల్పుల ఘటన నుంచి వాజేడు-వెంకటాపురం ఏరియా కమిటీ కార్యదర్శి సుధాకర్ తప్పించుకున్నారు. కాగా, మృతిచెందిన వాజేడు-వెంకటాపురం ఏరియా కమిటీ కార్యదర్శి శాంత సుధాకర్ భార్య.

అట్టుడుకుతున్న సరిహద్దు గ్రామాలు

మావోయిస్టుల ప్రభావం ఎక్కువగా ఉండే ఛత్తీస్‌గఢ్‌నుంచి తెలంగాణ సరిహద్దు మీదుగా నిత్యం నక్సల్స్ కదలికలు ఉంటాయి. పార్టీ కార్యకలాపాలను రాష్ట్రంలో విస్తరించే క్రమంలో మావోయిస్టులు సరిహద్దు దాటేందుకు ప్రయత్నించిన ప్రతీసారి తెలంగాణ పోలీసులు తిప్పికొడుతున్నారు. పోలీసులు లక్ష్యంగా అమర్చిన మందుపాతరలు, మారణాయుధాలను పెద్దఎత్తున స్వాధీనం చేసుకుంటున్నారు. ఈక్రమంలో ఎదురుకాల్పులు చోటుచేసుకుంటున్నాయి. కొన్ని సందర్భాల్లో మావోయిస్టులకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. గడిచిన నాలుగేళ్లలో జరిగిన ఎన్‌కౌంటర్ ఘటనలను పరిశీలిస్తే.. 2020 సెప్టెంబరు 3న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండలం దేవళ్లగూడెం అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఓ మావోయిస్టు, 20వతేదీన చర్ల మండలం పూసుగుప్ప అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మావోయిస్టులు, అదే నెల 23వతేదీన చర్ల మండలం జన్నంపేట అడవుల్లో జరిగిన మరో ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టులు మృతిచెందారు. అక్టోబరు 18న ములుగు జిల్లా మంగపేట మండలం కొప్పుగుట్ట వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మావోయిస్టులు మృతిచెందారు. వీరిలో ఒకరు మణుగూరు ఏరియా కమాండర్ సుధీర్. జూలై 25న వాజేడు మండలం టేకులగూడెంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టులు, 2021 ఆగస్టు 15తేదీన చర్ల మండలం బోదనెల్లి అటవీ ప్రాంతంలో ఒక మావోయిస్టు మృతిచెందాడు. డిసెంబరు 28న పెద్దపాపాలో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో నలుగురు మావోయిస్టులు మృతిచెందడం జరిగింది. తాజా ఎన్‌కౌంటర్‌తో సరిహద్దు పల్లెలు అట్టుడుకుతున్నాయి. ఆదివాసీ గూడాలు, గొత్తికోయ గుంపులపై పోలీసులు నిఘా పెంచారు. వాహనాల తనిఖీలను ఐదుపతున్నారు. దీంతో చిట్టడివి పల్లెల జనం భయాందోళనకు గురవుతున్నారు.

జోరుగా హుషారుగా..

రెండో రోజు కొనసాగిన స్ప్రింగ్ స్ప్రీ
నిట్‌లో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు
ఆకట్టుకున్న పలు కార్యక్రమాలు, గేమ్స్
అలరించిన సినీ నిర్మాత, డైరెక్టర్ల టాక్ షో..

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 6: జాతీయ సాంకేతిక విద్యాసంస్థ (నిట్) వరంగల్ వార్షికోత్సవ వేడుకల స్ప్రింగ్ స్ప్రీ రెండో రోజు శనివారం జోష్ కొనసాగింది. వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు మసూద సినిమా నిర్మాత రాహుల్ యాదవ్ నక్క, గామి సినిమా డైరెక్టర్ విద్యాధర్ కాగిత అండ్ టీమ్ టాక్ షో అంబేద్కర్ లర్నింగ్ సెంటర్ ఆడిటోరియంలో కిక్కిరిసిన విద్యార్థులను అలరించింది. వరంగల్ నిట్‌లోని వివిధక్లబ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన అనేక సాంస్కృతిక కార్యక్రమాలు ఆద్యంతం విద్యార్థులను ఉర్రూతలూగించాయి.

ర్యాప్, నిట్ సోలో ఐడల్ అదరహో...

నిట్ మ్యూజిక్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాప్, నిట్ సోలో ఐడల్ కార్యక్రమం అదరహో అనిపించింది. ఈకార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థుల ర్యాప్ గీతాలు పాడుతూ శ్రోతలను ఆనందింపజేశారు.

వాట్స్ డిఫరెండ్.. మెదడుకు మేత..

యూత్ రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన మరో ఆట వాట్స్ డిఫరెండ్. ఈ ఆటలో రెండు గదుల్లో నిర్మాణాలు వేర్వేరు ఛాయాచిత్రాలను ఉంచుతారు. రెండు గదుల్లోకి వెళ్లి వచ్చిన పార్టిసిపెంట్స్ వాటిని గుర్తుంచుకుని రాయాలి. లేదంటే ఈ ఆటలో ఓడిపోయినట్లే.

తెలుగు జిలుగుల చదరంగం..

తెలుగు లిటరరీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ గేమ్‌లో గోడకు కొన్ని జిలుగులు అతికించి ఉంచారు. పాల్గొనదలిచిన వారు జిలుగులో ఒక్కదానిని ఎంచుకోవడంతో ఒక టాపిక్ ఉంటుంది. ఆ టాపిక్ మీద తెలుగులో మాట్లాడాల్సి ఉంటుంది.

హంగర్ గేమ్స్.. ఫిట్‌నెస్‌పై గురి..

నిట్ ఫుడ్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన హంగర్ గేమ్స్ ఫిజికల్ ఫిట్‌నెస్‌పై అవగాహన పెంపొందిస్తుంది. ఫిట్‌నెస్, ఆరోగ్యం ప్రాముఖ్యతను తెలియజేయడానికి ఈ గేమ్‌ను నిర్వహించారు. పాల్గొనే విద్యార్థులు సిట్‌అప్స్, పుషప్స్ తదితర వ్యాయామ సంబంధ వర్కవుట్స్ చేయాల్సి ఉంటుంది.

మాస్టర్ చెఫ్.. అదిరే వంటలు..

నిట్ ఫుడ్ క్లబ్ ఆధ్వర్యంలో వంటల గేమ్ ఏర్పాటు చేశారు. ఈ గేమ్‌లో ఒక బాక్స్‌లో వేసిన చిట్టీల నుంచి పాల్గొనే వారు అందులో నుంచి కొన్ని చిట్టీలను తీసుకొని అందులో రాసిన పదార్థాలతో రాతఫూర్తిగా వంటను తయారు చేయాల్సి ఉంటుంది.


ఖల్‌నాయక్ ఈవెంట్ ప్రదర్శిస్తున్న దృశ్యం

తక్‌దీర్‌కా ఆగే..

ఫన్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ గేమ్‌లో పాటో వెనకాల రాసి ఉన్న విషయాన్ని పాల్గొనే వారు చేయాల్సి ఉంటుంది. ఇందులో పాటలు, సంభాషణలు, నృత్యాల తదితర అంశాలు ఉంటాయి.

ఖల్‌నాయక్.. ఏ సినిమాలో విలన్..

ఫిల్మ్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ గేమ్ విద్యార్థుల్లో జోష్ నింపింది. పాల్గొన్న విద్యార్థులు ఫోటో ఆధారంగా సంబంధిత పోటోలు ఉన్న వివిధ భాషల్లోని విలన్లు నటించిన చిత్రాల పేర్లు చెప్పాల్సి ఉంటుంది.

ఇంకా అనేకం..

నిట్‌లోని వివిధ క్లబ్‌ల ఆధ్వర్యంలో ఇంకా వివిధ రకాలైన ఫన్ గేమ్స్‌ను నిర్వహించారు. హిప్‌హాప్ క్విజ్, ఫొన్సెస్ వన్ టూ గెస్, ఫిల్మ్ క్విజ్, యానిమే మ్యూజియం, ఫొటో క్విజ్, మేజ్, ఫిల్మ్ ట్రెజర్ హంట్, డంబ్ చారడేస్ తదితర ఆటలు కొనసాగాయి.

స్ప్రింగ్ స్ప్రీలో నేటి కార్యక్రమాలు

తెలుగు సినిమా నటుడు, నిర్మాత నవదీప్ విద్యార్థులతో ముచ్చటిస్తారు. సీతారామం డైరెక్టర్ హను రాఘవపూడి డైరెక్టర్స్ కట్‌లో విద్యార్థులతో ముచ్చటిస్తారు.

సినిమాల్లోకి వచ్చేయండి..

టాక్ షోలో మసూద సినీ నిర్మాత రాహుల్ యాదవ్ నక్క

సినిమా రంగంలోకి రావాలనిపించే వ్రారు ఇంజనీర్లు దూకేయండి.. ఉత్సాహవంతులైన యువకులు ప్రతీ రంగం ఆహ్వానిస్తుందన్నారు. ఉన్నత లక్ష్యాలను ఎంచుకుంటే ఉన్నతమైన విషయాలు నేర్చుకోవచ్చునన్నారు. ఇంజనీరింగ్ పూర్తి చేసిన తాను మొదటి గేమ్స్ రంగంలోకి వెళ్లాలనుకున్నానని, తర్వాత రాజకీయం వైపు వెళ్లాలని, ఆ తర్వాత సివిల్స్ కోసం ప్రిపేర్ అయ్యానని. అదీ చేతకాక చివరికి సినిమా రంగాన్ని ఎంచుకున్నాను. ఇంజనీరింగ్ చేస్తున్నప్పుడే నాటకాల ప్రత్యేకత ఉండాలనే భావన నాలో ఉండేది. అదే భావనతో సినిమా రంగంలోకి వచ్చాను. ప్రతీ వ్యక్తి ప్రయత్నాలు చేయాలని, ఆ ప్రయత్నాల్లో పొరపాట్లు సహజంగా జరుగుతాయన్నారు. పొరపాట్లు లేకుండా విజయాలు అందుకోలేమన్నారు. పొరపాట్లను సరిదిద్దుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. సినిమా రంగాన్ని ఎంచుకున్నాక మా నాన్న తనతో చాలా రోజులు మాట్లాడలేదని చెప్పుకొచ్చారు. ప్రతీ రంగంలోనూ ఒత్తిడ్లుంటాయని, అయితే సినిమా రంగంలో ఎవరి ఐదుపడపాల్సిన అవసరం లేదన్నారు. ఆ వా నేను చేయడానికి ఇష్టపడాలనే స్వర్ధ ప్రొడక్షన్స్ స్థాపించాను. మంచి ప్రొడక్షన్ టీమ్ ఉంటే మంచి సినిమాలు వస్తాయని అభిప్రాయపడ్డారు. బ్రహ్మానందం కోసం లెన్స్ క్యారెక్టర్ 'బ్రహ్మానందం' టైటిల్‌తో ఇంజనీరింగ్ బేస్డ్ లవ్ స్టోరీ పూర్తి కామెడీగా తీయబోతున్నట్లు ఆయన వెల్లడించారు. భవిష్యత్తులో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో సినిమాలు వస్తాయన్నారు. విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానాలు చెప్పారు.

సృజన అద్భుత దృశ్యమానం గామి చిత్రం

చిత్ర దర్శకుడు విద్యాధర్ కాగితాల

హనుమకొండ, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): సృజనాత్మక ఆలోచనలకు అద్భుత దృశ్యరూపమే గామి చిత్రం అని ఆ సినిమా దర్శకుడు విద్యాధర్ కాగితాల అన్నారు. చిత్ర బృందంలోని సభ్యులందరి సమిష్టి కృషి ఫలితంగానే ఈ చిత్రం ఊహించినదానికన్నా బాగా రావడమే కాకుండా అనూహ్య విజయాన్ని సాధించిందని ఆయన అన్నారు. స్ప్రింగ్ స్ప్రీ వేడుకల్లో భాగంగా శనివారం రెండో రోజు వరంగల్ నిట్ క్యాంపస్‌లోని అంబేద్కర్ లర్నింగ్ హాల్‌లో నిర్వహించిన డైరెక్టర్స్ కట్ ఈవెంట్‌లో దర్శకుడు విద్యాధర్‌తో పాటు గామి చిత్ర బృందం పాల్గొన్నది.

ఈ సందర్భంగా విద్యాధర్ మాట్లాడుతూ.. ఆలోచనలకు అక్షర రూపం ఇస్తే పుస్తకం అవుతుంది. సృజనకు దృశ్య రూపం ఇస్తే అది సినిమా అవుతుందన్నారు. గామి తెలుగు చిత్రపరిశ్రమలో ఒక నూతన వరవడిని సృష్టించిందని అన్నారు. మొదట తాను లఘు చిత్రాల దర్శకుడిగా 2014 నుంచి 2017 మధ్య కాలంలో పలు షార్ట్ ఫిల్మ్‌లు తీశానని చెప్పారు. మెకానికల్ ఇంజనీర్ అయిన తాను యాంత్రికంగా ఉండలేక సృజనాత్మకత వేదిక అయిన ఫిల్మ్‌మేకింగ్ వైపు అడుగులు వేశానని చెప్పారు. ఇంజనీరింగ్ విద్యార్థుల్లో ఎంతో మంది ఫిల్మ్ మేకర్లు ఉన్నారని, అందుకు వారిలో చాలా మంది ఫిల్మ్ మేకర్లు ఉన్నారని అన్నారు. ఇంజనీరింగ్ విద్యార్థులు చాలా మంది ఫిల్మ్ మేకర్లు ఉన్నారని అన్నారు. అద్భుతాలు చేయాలనుకునే విద్యార్థుల కోసం తాను ఎదురుచూస్తున్నానని అన్నారు. నిట్ ఫిల్మ్ అండ్ మ్యూజిక్ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. ఈ డైరెక్టర్స్ కట్స్ పలు రౌండ్లుగా సాగింది. వన్ టైమ్ ఎమ్ రీయాక్షన్స్, చిత్రంపై మిమిక్, ఇష్టమైన సన్నివేశం మొదలైన వాటి గురించి అడిగిన ప్రశ్నలకు దర్శకుడితో పాటు చిత్రబృందం ఇచ్చిన సమాధానాలు విద్యార్థులను కేరింతలు కొట్టించాయి. నిట్‌లోని ఫిల్మ్ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ డైరెక్టర్స్ కట్స్ ఈవెంట్‌కు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. విద్యార్థులతో హాల్ కిక్కిరిసిపోయింది. అనంతరం విద్యార్థి అంతకు ముందు నిర్మించిన షార్ట్ ఫిల్మ్‌లను, అలాగే గామి ట్రైలర్‌ను ప్రదర్శించారు.

మార్కెట్ యార్డుకు మూడు రోజులు సెలవు

జనగామ కల్చరల్, ఏప్రిల్ 6: వ్యవసాయ మార్కెట్ యార్డుకు మూడు రోజుల పాటు సెలవులు ప్రకటించారు. ఈ నెల 7న ఆదివారం సాధారణ సెలవు, 8న సోమవారం అమావాస్య, 9న ఉగాది పర్వదినం నేపథ్యంలో మూడు రోజుల పాటు యార్డు బంద్ చేస్తున్నారు. ఈ నెల 10వ తేదీ బుధవారం మార్కెడ్ యార్డు పునఃప్రారంభిస్తారు. రైతులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని మార్కెట్ కమిటీ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఆస్తులు బయటపెడితే

కడియం గుండె పగులుతుంది

ఘన్‌పూర్ రైతు దీక్షలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి



రైతు దీక్ష కార్యక్రమంలో నాయకులతో కలిసి కూర్చున్న ఎమ్మెల్యే పల్లా

స్టేషన్‌ఘన్‌పూర్, ఏప్రిల్ 6: కడియంకు సంబంధించిన ఆస్తుల వివరాలను బయటపెడితే ఆయన గుండె పగిలి చస్తాడని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు. శనివారం ఆయన స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఏర్పాటు చేసిన రైతుదీక్షలో మాట్లాడారు. కడియం పార్టీ మారడంతో శనిపోయిందన్నారు. తాలుగాళ్లు పోయినంత మాత్రాన బీఆర్ఎస్‌కు వచ్చిన ఇబ్బంది ఏమీ లేదన్నారు. కడియంకు చిత్తశుద్ధి ఉంటే ధాన్యానికి రూ.500 బోనస్ ఇప్పించాలని, రూ.2లక్షల రుణమాఫీ చేయించాలని డిమాండ్ చేశారు. కడియం నీతిమంతుడు, నిజాయితీపరుడు అయితే.. సిగ్గుశరం ఉంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి గెలువాలని డిమాండ్ చేశారు. ఘన్‌పూర్ నియోజకవర్గం కడియంను ఎమ్మెల్యేగా, ఎంపీగా, ఎమ్మెల్సీగా, డిప్యూటీ సీఎంగా చేస్తే అదే ఘన్‌పూర్ ప్రజలను నేడు మోసం చేశాడని విమర్శించారు. జడ్పీ చైర్మన్ సంపత్ రెడ్డి చనిపోతే ఒక్క పైసా సాయం చేయలేదని, పైగా తాను సాయం చేసే క్రమంలో "ఇద్దరం కలిసి చేస్తున్నట్లు చెప్పు" అని మాట్లాడిన వ్యక్తి కడియం అని ఎద్దేవా చేశారు. కడియంను రాజకీయంగా బొందపెట్టడం ఖాయమన్నారు. తాను బీఆర్ఎస్ వీడుతున్నట్లు కొందరు మాట్లాడుతున్నారని, తాను చనిపోయే వరకు బీఆర్ఎస్‌ను వీడనని స్పష్టం చేశారు.

కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎడవెల్లి కృష్ణా రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఏనుగు రాకేష్‌రెడ్డి, ఆకుల కుమార్, మహేందర్ రెడ్డి, మెట్టు శ్రీనివాస్, అక్కెనపల్లి బాలరాజు, జడ్పీటీసీ చాడ సరిత, ఎంపీపీ చిట్ల జయశ్రీ, పార్టీ మండలాధ్యక్షుడు మాచర్ల గణేష్, మారపల్లి ప్రసాద్, కనకం గణేష్ పాల్గొన్నారు.

రణదీవె స్ఫూర్తితో కార్మిక ఉద్యమాలు

సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాపర్తి రాజు

జనగామ కల్చరల్, ఏప్రిల్ 6: కార్మికోద్యమ ధ్రువతార రణదీవె స్ఫూర్తితో కార్మిక ఉద్యమాలు చేపట్టాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాపర్తి రాజు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో సీఐటీయూ వ్యవస్థాపక అధ్యక్షులు బి.టి.రణదీవె 34వ వర్ధంతి సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రణదీవె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశానికి సుంచు విజేందర్ అధ్యక్షత వహించగా రాజు మాట్లాడారు. స్వాతంత్ర్యం అనంతరం దేశంలో కార్మికుల హక్కుల కోసం పోరాడే ట్రేడ్ యూనియన్ ఉండాలని పోరాడిన సీఐటీయూ వ్యవస్థాపకుల్లో రణదీవె ఒకరని అన్నారు. రణదీవె స్ఫూర్తితో కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై సమరశీల పోరాటాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో సాంబరాజు యాదగిరి, ఇర్రి అహల్య, జోగు ప్రకాష్, అన్నెబోయిన రాజు, భైరపాక శ్రీనివాస్, కళ్యాణం లింగం, గంగరబోయిన మల్లేష్, రాజ్‌గాడి శివ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉగాది క్యాలెండర్ ఆవిష్కరణ

పాలకుర్తి, ఏప్రిల్ 6: శ్రీ సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి మేరు సంఘం ఆధ్వర్యంలో ఉగాది నూతన సంవత్సర క్యాలెండర్‌ను శనివారం సంఘం భవనంలో ఆవిష్కరించారు. మేరు కులదైవమైన జరగిరి శంకర దాసమయ్య చిత్రపటాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం బాధ్యులు రాపర్తి ప్రశాంత్, సోమ సత్యం, శ్రావన్‌కుమార్, యాదగిరి, వాసు, గూడూరు లెనిన్, రవి, లక్ష్మీనారాయణ, వెంకటయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.







పాలకుర్తి నుంచి జన జాతర సభకు తరలివెళుతున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, నాయకులు - కొడకండ్ల నుంచి బయలుదేరుతున్న కాంగ్రెస్ శ్రేణులు - బచ్చన్నపేట నుంచి తరలుతున్న కాంగ్రెస్ శ్రేణులు

తుక్కుగూడకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు

చిలుపూర్, ఏప్రిల్ 6: హైదరాబాద్ సమీపంలోని తుక్కుగూడలో శనివారం నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ ఎన్నికల బహిరంగసభకు జిల్లా నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలివెళ్లారు. కాంగ్రెస్ పార్టీ చిలుపూర్ మండల ఇన్‌చార్జి తీగల మహేందర్, అధ్యక్షుడు గడ్డమీది సురేశ్ నేతృత్వంలో చిన్నపెండ్యాల, వంగాలపల్లి, రాజవరం, పల్లగుట్ట, మల్కాపూర్, లింగంపల్లి తదితర గ్రామాల నుంచి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్సుల్లో తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటుతుందని అన్నారు. సభకు తరలినవారిలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ చిర్ర నాగరాజు, మామిడాల లింగారెడ్డి, భూక్య సుధాకర్ నాయక్, తాళ్ళపల్లి సమ్మయ్య, రత్నాకర్‌రెడ్డి, వేల్పుల గట్టయ్య, దార అశోక్‌పాల్, ఎడ్ల యాదగిరి, జక్కుల రాజయ్య, గడ్డమీది వెంకటస్వామి, తాళ్ళపల్లి సంపత్‌కుమార్, భూక్య రవి నాయక్, ఇల్లందుల యాదగిరి, నల్ల ఎల్లయ్య, పుట్ట కిరన్‌రెడ్డి, తౌటి సునిల్ తదితరులు ఉన్నారు.

పాలకుర్తి: తుక్కగూడ సభకు తరలివెళుతున్న వాహనాలను పాలకుర్తి రాజీవ్ చౌరస్తాలో ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ అత్యధిక స్థానాలను గెలుచుకుంటుందని అన్నారు. తరలి వెళ్లిన వారిలో నాయకులు రాపాక సత్యనారాయణ, పులి గణేష్, మహేష్, రమేష్, యాకయ్య శ్రీనివాస్ ఉన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్: తుక్కుగూడ సభకు కాంగ్రెస్ పార్టీ రైతు విభాగం రాష్ట్ర నాయకుడు మంతెన ఇంద్రసేనా రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు తరలివెళ్లారు. మీదికొండ గ్రామం నుంచి మాజీ సర్పంచ్ నాగరబోయిన మణెమ్మ-యాదగిరి ఆధ్వర్యంలో నాయకులు దుంపల సురేష్ రెడ్డి, రాజు, రమేష్, రాంచంద్రం తదితరులు వెళ్లారు.

కొడకండ్ల: తుక్కుగూడ బహిరంగ సభకు వెళ్ళే బస్సులను కాంగ్రెస్ పార్టీ మండల ఇంచార్జి తిరుపతి రెడ్డి నిరంజన్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు డి.సురేష్ నాయక్ శనివారం ప్రారంభించారు.

రఘునాథపల్లి: తుక్కుగూడ బహిరంగ సభకు మండలం నుంచి కాంగ్రెస్ అధ్యక్షుడు కోళ్ల రవి, ఎంపీపీ మేకల వరలక్ష్మి నరేందర్, లింగాల జగదీష్ చందర్ రెడ్డి, గాదె మహేందర్ రెడ్డి, కడారి రవి, నీలం యువరాజ్, రంగు రాజు, వెంకటేశ్వర్లు, ఇబ్రహీం పాష, వెంకట్ నాయక్, ఉడుత గోపాల్, చెంచు రమేష్, శ్రావణ్, శివప్రసాద్ తదితరులు తరలివెళ్లారు.

జఫర్‌గడ్: తక్కుగూడ జనజాతర సభకు జఫర్‌గడ్‌తో పాటు ప్రతి గ్రామం నుంచి బస్సులు, కార్లు, ఇతర వాహనాల్లో పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు. పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ విజయఢంకా మోగిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. మతతత్వ బీజేపీకి ఈసారి ప్రజల చేతిలో శృంగభంగం తప్పదన్నారు. వరంగల్ పార్లమెంటు స్థానంలో పార్టీ అభ్యర్థి కడియం కావ్య గెలుపు ఖాయమని పేర్కొన్నారు. తరలి వెళ్లిన వారిలో ఎంపీపీ సుదర్శన్, జడ్పీటీసీ బేబీ, వైస్ ఎంపీపీ కనకయ్య, సొసైటీ చైర్మన్ కరుణాకర్‌రావు, వైస్ చైర్మన్ నర్సింగం, మార్కెట్ కమిటి మాజీ చైర్మన్‌లు అన్నెబోయిన బిక్షపతి, అన్నం బ్రహ్మారెడ్డి, గుజ్జరి రాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మంచాల ఎల్లయ్య మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నూకల అయిలయ్య, జ్యోతి యాకయ్య, కుక్కల ఎల్లయ్య, మామిడి శీనయ్య, మంచాల అనిల్, రాజయ్య, తదితర పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

తరిగొప్పుల: తుక్కగూడ జనజాతర సభకు కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు వగలబోయిన యాదగిరి ఆధ్వర్యంలో బారీ సంఖ్యలో నాయకులు తరలివెళ్లారు. వారిలో ముడికె కుమార్, దామెర జోసెఫ్, ఎడ్ల నవీన్, ముడికె కుమార్, నాం బాలయ్య, సిరిగిరి మహేందర్ ఉన్నారు.

బచ్చన్నపేట: తుక్కుగూడ బహిరంగ సభకు కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివెళ్లాయి. పార్టీ మండల అధ్యక్షులు నూకల బాల్‌రెడ్డి నేతృత్వంలో పెద్ద సంఖ్యలో వాహనాల్లో తరలివెళ్లారు. బచ్చన్నపేట నుంచి వాహనాలను తరలించారు. వారిలో రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం



నర్మెటలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఎమ్మెస్పీ నాయకులు

నర్మెట, ఏప్రిల్ 6 : లోకసభ సీట్ల కేటాయింపులో మాదిగలకు స్థానం కల్పించకుండా కాంగ్రెస్ నమ్మకద్రోహం చేసిందని ఆరోపిస్తూ శనివారం నర్మెట మండలకేంద్రంలో ఎంఎస్‌పీ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈసందర్భంగా ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు గద్దల కిషోర్‌మాదిగ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మాదిగలకు, బీసీలకు అన్యాయం చేసిందన్నారు. రాష్ట్రంలో నాలుగు శాతం లేని రెడ్లకు ఆరు స్థానాలు, యాభై శాతం ఉన్న బీసీలకు రెండు స్థానాలేనని, మాదిగలకు మాత్రం ఒక్క సీటు కూడా కేటాయించలేదని అన్నారు. కాంగ్రెస్ పునరాలోచన చేసి మూడు ఎస్సీ పార్లమెంట్ స్థానాల్లో రెండు స్థానాలను మాదిగలకే కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంఎస్‌పీ జిల్లా అధికార ప్రతినిధి సందెన రవీందర్‌మాదిగ, రాష్ట్ర నాయకుడు చుంచు రాజు, నాయకులు కంతి చరణ్, మెతుకు సిద్దులు, చెవుల రాజు, కొర్ర సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

సెయింట్ పాల్స్ ఉపాధ్యాయుడు

గుండెపోటుతో మృతి



చొప్పరి గణేష్ (ఫైల్)

జనగామ కల్చరల్, ఏప్రిల్ 6: ప్రైవేటు స్కూల్ ఉపాధ్యాయుడు విధినిర్వహణలో గుండెపోటుతో హఠాన్మరణం చెందాడు. జనగామ పట్టణంలోని సెయింట్‌పాల్స్ స్కూల్‌లో తెలుగు ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న చొప్పరి గణేష్ (37) శనివారం విద్యార్థులకు బోధన చేస్తున్న క్రమంలో గుండె పోటు వచ్చి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. తోటి ఉపాధ్యాయులు జిల్లా ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు హైద్రాబాద్ గాంధీ ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. జనగామ మండలం వడ్లకొండ గ్రామానికి చెందిన గణేష్‌కు భార్యతో పాటు ఏడేళ్లలోపు వయసులో అమ్మాయి, ఇద్దరు అబ్బాయిలు ఉన్నారు. గణేష్ మృతి పట్ల సెయింట్ పాల్స్ స్కూల్ ప్రిన్సిపాల్ మరియ జోసెఫ్, ఉపాధ్యాయులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసి, నివాళులర్పించారు.

తాగునీటి ఎద్దడి నివారణకు పటిష్ఠ చర్యలు

ప్రత్యేక అధికారి బి.గోపి



సమావేశంలో మాట్లాడుతున్న తాగునీటి ప్రత్యేక అధికారి బి.గోపి

జనగామ కల్చరల్, ఏప్రిల్ 6: తాగునీటి ఎద్దడి నివారణకు పటిష్ఠ చర్యలు చేపట్టాలని జిల్లా తాగునీటి ప్రత్యేక అధికారి, అగ్రికల్చరల్ డైరెక్టర్ బి.గోపి కోరారు. శనివారం కలెక్టరేట్‌లో తాగునీటి ఎద్దడి నివారణపై కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్ తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గోపి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తాగునీటి సరఫరాకు ప్రాధాన్యత ఇస్తోందన్నారు. భూగర్భ జలాలు అడుగంటిపోతున్న నేపథ్యంలో ప్రజలకు తాగునీరు అందించేందుకు మిషన్ భగీరథ, స్థానిక నీటి వనరుల ద్వారా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. కలెక్టర్ రిజ్వాన్ బాషా మాట్లాడుతూ రానున్న రోజుల్లో తాగునీటి సరఫరాను ప్రణాళికాబద్ధంగా అందించాలని సూచించారు. హ్యాండ్ పంపులు, బోర్‌వెల్స్ తదితర తాగునీటి వనరులను సరైన విధంగా నిర్వహించాలన్నారు. సమ్మర్ యాక్షన్ ప్లాన్ రూపొందించాలని, ఎంపీడీవోలు, ఎంపీవోలు ఎప్పటికప్పుడు గ్రామాలను పర్యవేక్షించాలన్నారు. సమావేశంలో ఆర్డీవోలు కొమురయ్య, వెంకన్న, జడ్పీ సీఈవో అనిల్‌కుమార్, డీపీవో వినోద్‌కుమార్, డీఈవో రాము, మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టేషనరీ పంపిణీ

జనగామ కల్చరల్, ఏప్రిల్ 6: మండలం లోని వెంకిర్యాల ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు బి.విద్యారాణి తన తండ్రి బక్క రత్నం జ్ఞాపకార్థం శనివారం విద్యార్థులకు స్టేషనరీ పంపిణీతో పాటు విందు భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు దూడల రమేష్, ఉపాధ్యాయులు నల్లా లలిత, వలబోజు స్రవంతి, గ్రామస్థులు పాల్గొన్నారు.

బీజేపీతోనే దేశ రక్షణ సాధ్యం

వరంగల్ పార్లమెంట్ కన్వీనర్ ఇనుగాల యుగేంధర్ రెడ్డి

జిల్లాలో ఘనంగా పార్టీ ఆవిర్భావ వేడుకలు



పాంనూర్‌లో బీజేపీ జెండాను అవిష్కరించి మాట్లాడుతున్న యుగేంధర్ రెడ్డి

స్టేషన్‌ఘన్‌పూర్, ఏప్రిల్ 6: బీజేపీతోనే దేశ రక్షణ సాధ్యమవుతుందని ఆ పార్టీ వరంగల్ పార్లమెంట్ కన్వీనర్ ఇనుగాల యుగేంధర్ రెడ్డి అన్నారు. బీజేపీ 44వ అవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం పాంనూర్ గ్రామంలో నాయకులతో కలిసి ఆయన బీజేపీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పదేళ్ల బీజేపీ పాలనలో దేశంలో అనేక సంస్కరణలను ప్రధాని మోదీ తీసుకువచ్చారన్నారు. ప్రపంచ దేశాలు గర్వపడేలా భారత్‌ను తీర్చిదిద్దారని కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ మండల ఉపాధ్యక్షుడు తాళ్లపల్లి కిశోర్‌గౌడ్, నాయకులు బల్లా రాజు, బాషబోయిన సాంబరాజు, బల్లా శ్రీను, బండ ప్రశాంత్, బండ శివ, తాళ్లపల్లి కల్యాణ్, శివగణేష్, తదితరులు పాల్గొన్నారు.

జఫర్‌గడ్: బీజేపీ ఆవిర్భావం సందర్భంగా శనివారం ఉప్పుగల్లు, కూనూరులలో టిఫిన్ బైటక్ కార్యక్రమాలను నిర్వహించారు. పార్టీ జెండాలను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సమావేశాల్లో బీజేపీ మండల అధ్యక్షుడు కోరుకొప్పుల నాగేశ్ మాట్లాడుతూ కేంద్రంలో మళ్లీ బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. జరగబోయే పార్లమెంటు ఎన్నికల్లో వరంగల్ స్థానంలో పార్టీ ఎంపీ అభ్యర్థి ఆరూరి రమేశ్ విజయమే లక్ష్యంగా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమాల్లో పార్టీ, అనుబంధ సంఘాల నేతలు తిరుపతి, మూల మహేశ్, ఇల్లందుల సారయ్య, నాగరాజు, నేరెళ్ల రాజు, గడ్డం రాజు, పులి రాజు, నాయిని యాదగిరి, మూల యాకయ్య, గోపాల్‌రావు, అశోక్, పాల్గొన్నారు.

రఘునాథపల్లి: మండలంలో బీజేపీ ఆవిర్భావ వేడుకలను బీజేపీ నాయకులు శనివారం ఘనంగా నిర్వహించారు. కోమల్ల, మండేలగూడెం గ్రామాలలో పార్టీ జెండాను ఎగుర వేశారు. కార్యక్రమంలో మంద వెంకటేషం యాదవ్, వల్లాల ఉపేందర్, వెంకటయ్య గౌడ్, వల్లాల శ్రీనివాస్, అవదూత శంకరయ్య, చందర్ నాయక్, కొమురయ్య, శోభ, సుగుణ, లక్ష్మి, గట్టమ్మ, రమ, పారిజాత, పద్మ, వేణుకుమార్ పాల్గొన్నారు.

నర్మెట: బీజేపీ మండల అధ్యక్షుడు ధరావత్ రాజు ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. మండలకేంద్రంలో టిఫిన్ బైటక్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ధరావత్ రాజు మాట్లాడుతూ భువనగిరి పార్లమెంట్‌లో బీజేపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్ గెలుపు కోసం ప్రతీ కార్యకర్త కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి సౌక్యం అనిల్‌కుమార్, మండల ఉపాధ్యక్షుడు చెవుల రాజు, కార్యదర్శి మెతుకు సిద్దులు, సాయినాథ్, దళిత మోర్చా మండల అధ్యక్షుడు కొమురెల్లి తదితరులు పాల్గొన్నారు.

చిలుపూర్: బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని వంగాలపల్లిలో ఆ పార్టీ నాయకులు వేడుకలు నిర్వహించారు. కరుణాపురం - వంగాలపల్లి చౌరస్తా వద్ద బీజేపీ మండలాధ్యక్షుడు గంటె ఉపేందర్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో బీజేపీని మరింతగా ఆదరించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో శ్రవన్, రమేష్, తిరుపతిరెడ్డి, శ్రీకాంత్, ఆదర్శ్, ఆరూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బచ్చన్నపేట: బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బచ్చన్నపేట, తమ్మడపల్లి, కట్కూరుతో పాటు గ్రామాల్లో జండావిష్కరణ చేశారు. టిఫిన్ బైఠక్ కార్యక్రమంలో పాల్గొన్నారు. నరేంద్రమోదీ మరోమారు ప్రధాని కావటం ఖాయమన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు బేజాడి బీరప్ప, మండల అధ్యక్షులు చిమ్ముల నరేందర్‌రెడ్డి, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షులు గంగిశెట్టి శ్రీనివాస్, నాయకులు పెండెం నగేష్, దొంతుల చంద్రమౌళి, గుంటిపల్లి శ్రీనివాస్, జూకంటి గణేశ్ తదితరులు పాల్గొన్నారు. కట్కూరులో సఫాయి కార్మికులను సన్మానించారు.

విద్యుత్‌షాక్‌తో ఔట్ సోర్సింగ్ ఉద్యోగి మృతి



విద్యుత్‌షాక్‌తో మృతి చెందిన శ్రీశైలం

పాలకుర్తి, ఏప్రిల్ 6: విద్యుత్ శాఖలో ఔట్ సోర్సింగ్ (కట్టర్)ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్న తీగారం గ్రామానికి చెందిన భైకాని శ్రీశైలం శనివారం సాయంత్రం విద్యుదాఘాతంతో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ముత్తారం గ్రామ శివారులో ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు చేయడానికి వల్మిడి సబ్‌స్టేషన్ నుంచి అధికారుల అనుమతితో ఎల్‌సీ తీసుకున్నాడు. అయితే ఇతర విద్యుత్ తీగలకు విద్యుత్ సరఫరా అయిన విషయాన్ని తను గుర్తించలేదు. ఈ క్రమంలో ట్రాన్స్‌ఫార్మర్‌పై మరమ్మతు చేస్తుండగా షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించి ఎస్సై సాయి ప్రసన్నకుమార్ కేసు నమోదు చేశారు. మృతుడికి భార్య రాణి, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలంలో ఘటన



రొడ్డ ప్రణయ్ (ఫైల్)

చిలుపూర్, ఏప్రిల్ 6: సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం రామవరం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో చిలుపూర్ మండలం శ్రీపతిపల్లికి చెందిన రొడ్డ ప్రణయ్ (21) అనే యువకుడు మృతిచెందాడు. వృత్తిరీత్యా తను హైదరాబాద్ కూకట్‌పల్లిలో ఉంటూ ఆమెజాన్ కంపెనీలో డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. కాగా, అక్కన్నపేట మండలం కొండాపూర్‌లో గల బంధువుల ఇంట్లో వివాహానికి శుక్రవారం తన తల్లిదండ్రులు సుధాకర్ - జయతో కలిసి వెళ్ళాడు. వివాహం అనంతరం ప్రణయ్ బైక్‌పై ఒక్కడే శ్రీపతిపల్లికి వస్తుండగా రామవరం సమీపంలో అదుపుతప్పి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో ప్రణయ్ తలకు బలమైన గాయం కావడంతో అపస్మారక స్థితిలోకి వెళ్ళిపోయాడు. సమాచారమందుకున్న కుటుంబ సభ్యులు మొదటగా హుస్నాబాద్‌కు, ఆ తర్వాత కరీంనగర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచనల మేరకు అక్కడినుంచి హైదరాబాద్‌కు తరలించగా పరిస్థితి విషమించడంతో శనివారం మృతిచెందాడు. చేతికందిన కొడుకు అకాల మరణంతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది.

అనాథాశ్రమంలో మహిళ మృతి

- మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు కుటుంబ సభ్యుల నిరాకరణ
- ఏసీపీ కౌన్సెలింగ్‌తో అంగీకారం



లక్ష్మి (ఫైల్)

జనగామ, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): అనాథాశ్రమంలో అనారోగ్యంతో మృతిచెందిన మహిళ మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు ఆమె కుటుంబసభ్యులు నిరాకరించగా పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి తీసుకెళ్లేలా చేశారు. ఈ దయనీయ ఘటన జనగామలోని రాజరాజేశ్వరి సేవా అనాథాశ్రమంలో శనివారం జరిగింది. వివరాల్లోకెళితే.. మహబూబాబాద్ జిల్లా తొర్రూరుకు చెందిన కాశబోయిన లక్ష్మి(35)కి టీబీ వ్యాధి సోకింది. ఈ క్రమంలో ఆమె కుటుంబ సభ్యులు ఇంటి నుంచి గెంటేశారు. దీంతో ఆమె కట్టుబట్టలతో వరంగల్ రైల్వే స్టేషన్‌కు చేరుకుంది. 12 ఏళ్ల కూతురితో కలిసి రైల్వే స్టేషన్‌లో ఒంటరిగా ఉంటూ భిక్షాటన చేస్తూ జీవించేది. ఆమె పరిస్థితిని తెలుసుకున్న వరంగల్‌కు చెందిన సామాజిక కార్యకర్త మహ్మద్ పసి జనగామలోని రాజరాజేశ్వరి సేవా అనాథాశ్రమంలో గతేడాది అక్టోబరులో చేర్పించాడు. అప్పటి నుంచి అనాథాశ్రమంలోనే ఉంటున్న లక్ష్మీ శనివారం అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందింది. ఆమె భర్త, కుటుంబ సభ్యులకు అనాథాశ్రమం నిర్వాహకులు సమాచారం అందించగా మృతదేహాన్ని తీసుకెళ్లడానికి నిరాకరించారు. ఈ విషయాన్ని జనగామ ఏసీపీ అంకిత్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన మృతురాలి భర్త అనిల్, ఇతర కుటుంబ సభ్యులను పిలిపించి కౌన్సెలింగ్ ఇవ్వడంతో వారు అంగీకరించి మృతదేహాన్ని తీసుకెళ్లారు. మృతురాలికి భర్తతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతదేహాన్ని తరలించేందుకు అంబులెన్స్ ఖర్చులను జనగామ సీఐ రఘుపతిరెడ్డి అందించి ఉదారతను చాటుకున్నారు.

కాంగ్రెస్ మహిళా విభాగం అధ్యక్షురాలిగా పోలు రాధిక



చిలుపూర్, ఏప్రిల్ 6 : మండలంలోని కృష్ణాజీగూడెం కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలిగా గ్రామానికి చెందిన పోలు రాధిక నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింగపురం ఇందిర శనివారం ఉత్తర్వులను జారీ చేశారు. ఈ సందర్భంగా రాధిక మాట్లాడుతూ, తనపై నమ్మకంతో మహిళా అధ్యక్షురాలిగా నియమించిన ఇందిరతో పాటు, మండల నాయకులు గడ్డమీది సురేశ్, తీగల మహేందర్, పుట్ట కిరణ్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

చిలుపూర్, ఏప్రిల్ 6 : మండలంలోని వెంకటాద్రిపేటలో బ్రెయిన్‌స్ట్రోక్ కారణంగా మృతిచెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, గ్రామశాఖ మాజీ అధ్యక్షుడు గాదె జయపాల్‌రెడ్డి కుటుంబాన్ని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి శనివారం సందర్శించారు. మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. తక్షణసాయంగా రూ.50వేలు అందజేశారు. అదేవిధంగా జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సైతం నివాళి అర్పించడంతో పాటు, రూ.20వేలు అందజేశారు. వారి వెంట ఎంపీపీ బొమ్మిశెట్టి సరిత -బాలరాజు, ఎంపీటీసీ ఎన్నకూస కుమార్, ఏడవెళ్లి కృష్ణారెడ్డి, భూక్య రమేష్‌నాయక్, ఏడవెళ్లి మాధవరెడ్డి, చల్లా రాజ మహేందర్ రెడ్డి, దేవి తిరుపతి రెడ్డి, మంతెన లవన్, కందుల రఘుపతి, మామిడాల లింగారెడ్డి, గడ్డమీది వెంకటస్వామి, తాళ్ళపల్లి సమ్మయ్య ఉన్నారు.

తులసి కృష్ణవేణి సేవలు మరువలేనివి

కొనియాడిన డీఈవో, టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర నేతలు



కుటుంబసభ్యులకు రూ.6లక్షల చెక్కు అందజేస్తున్న డీఈవో, యూటీఎఫ్ నేతలు

బచ్చన్నపేట, ఏప్రిల్ 6: నిబద్ధత కలిగిన ఉపాధ్యాయురాలిగానే కాకుండా, సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా ఉండే తులసి కృష్ణవేణి అకాల మరణం బాధాకరమని డీఈవో రాము అన్నారు. మండలంలోని కొన్నె ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు కృష్ణవేణి ఇటీవల మృతి చెందగా శనివారం సంస్మరణ సభ గొట్టె కనకయ్య అధ్యక్షతన నిర్వహించారు. టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో రూ.6 లక్షల చెక్కును కుటుంబ సభ్యులకు డీఈవో, రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు జంగయ్య, రాజశేఖర్‌రెడ్డి, రంజిత్‌కుమార్‌ల చేతుల మీదుగా అందించారు. అకాల మరణం చెందిన వారి కుటుంబాలను ఆదుకోవటం మంచి నిర్ణయమని డీఈవో కొనియాడారు. రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో ఎఫ్‌డబ్ల్యుఎఫ్ కుటుంబ సంక్షేమ పథకం పనిచేస్తోందన్నారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో 18 మంది ఉపాధ్యాయుల కుటుంబాలకు రూ. 1.08 కోట్ల సహాయం అందించామన్నారు. రాష్ట్రంలో టీఎస్‌యూటీఎఫ్ మాత్రమే ఇలాంటి సేవ చేస్తోందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డి, కోశాధికారి సుధాకర్, కార్యదర్శి కృష్ణ, నోడల్ ఆఫీసర్ మూర్తి, కృష్ణమోహన్, శ్రీధర్, లలిత, నీలకంఠం, ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత ఎంతో ముఖ్యం

- సీనియర్ సివిల్ జడ్జి సి.విక్రమ్



సదస్సులో మాట్లాడుతున్న జడ్జి విక్రమ్

జనగామ కల్చరల్, ఏప్రిల్ 6: ఆరోగ్య పరిరక్షణకు పరిసర ప్రాంతాల పరిశుభ్రత ఎంతో ముఖ్యమని జిల్లా కోర్టు సీనియర్ సివిల్ జడ్జి సి.విక్రమ్ అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా ఆసుపత్రి లో అవగాహనా సదస్సు నిర్వహించారు. జడ్జి ముఖ్య అతిథిగా హాజరైన జడ్జి మ మాట్లాడుతూ మన ఆరోగ్యం మన హక్కు నినాదంతో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు. డాక్టర్లు కూడా ప్రతీ సంవత్సరం మెడికల్ చెకప్ చేయించుకోవాలన్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుగుణాకర్‌రాజు మాట్లాడుతూ ఆస్పత్రిలో డాక్టర్ల సంఖ్య పెరిగినందున పేషెంట్లకు టైం వృథా కాకుండా పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ చీఫ్ ఎం.రవీంద్ర, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఇ.జ్యోత్స్న, ఆర్.శ్రీహరి పాల్గొన్నారు.

వైభవంగా వెంకన్న వార కల్యాణం

పెద్దఎత్తున తరలివచ్చిన భక్తులు

చిలుపూర్, ఏప్రిల్ 6: చిలుపూర్ గుట్ట బుగులు వెంకన్న దేవాలయంలో శనివారం వార కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. వేడుకలు చూసి తరించడానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో హాజరు కాగా, ఆలయ ప్రధాన అర్చకుడు బ్రాహ్మణపల్లి రవీందర్ శర్మ, పూజారి సౌమిత్రి రంగాచార్యులు వేదమంత్రాలనాలపించి ఉత్సవమూర్తుల కల్యాణాన్ని ఘనంగా ముగించారు. అనంతరం కల్యాణంలో కూర్చున్న కుటుంబాలకు స్వామివారి శేష వస్త్రాలతో పాటు, తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈవో లక్ష్మీ ప్రసన్న, కృష్ణమాచార్యులు, శాశ్వత ధర్మకర్త సంగోజు మోహనాచారి - శంకరలక్ష్మి, జూనియర్ అసిస్టెంట్ ఆడెపు రమేష్, రికార్డ్ అసిస్టెంట్ వీరన్న, విశాల్, గాదె రాజశేఖర్, మహేశ్, ధర్మకర్తలు పాల్గొన్నారు.